నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | నవంబర్ 13, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉట్నూర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆసిఫాబాద్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు విలాస్ బానోత్ అధ్యక్షతన ఎమ్మెల్యే బొజ్జు సమక్షంలో సేవాదళ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేవాదళ్ ఇన్‌చార్జి నీలకంఠేశ్వరగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20న సేవాదళ్ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తి అవుతున్నందున రాష్ట్రవ్యాప్తంగా సేవాదళ్ కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న శతాబ్ది ఉత్సవాలకు కార్యకర్తలను, అభిమానులు భారీ ఎత్తున తరలించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాదళ్ పార్టీకి వెన్నుముక లాంటిదన్నారు. జిల్లా, మండలాల ఇన్‌చార్జీల నియామక బాధ్యతను ఆసిఫాబాద్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు భానోత్ విలాస్ నాయక్‌కు ఇచ్చామని తెలిపారు. ప్రజలను అధిక సంఖ్యలో ఉత్సవాలకు తీసుకురావాలని తెలిపారు.



బాబాయ్ మందలించాడని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

బాబాయ్ మందలించాడని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అంజమ్మ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పల్సి(బి) గ్రామానికి చెందిన కుమ్ర శివశాంత్(19) ఈ నెల 7న మద్యం తాగి మోటార్ సైకిల్‌పై ఇంటికొచ్చాడు. మద్యం మత్తులో కింద పడటంతో బాబాయ్ దత్తు ఉదయం పూట ఎందుకు మద్యం తాగావని మందలించాడు. క్షణికావేశంలో శివశాంత్ ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పీడీఎస్ దందా...అధికారులే అండ..!

- కొనసాగుతున్న రేషన్ డీలర్ల హవా
- అడ్డగోలుగా మహారాష్ట్రకు తరలింపు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ డీలర్లే పెద్ద ఎత్తున బియ్యం అక్రమ దందాకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమార్జనకు తెర లేపుతున్నారు. ఒకప్పుడు రాజకీయ నాయకుల అండతో కొనసాగిన అక్రమ బియ్యం దందాకు ఇప్పుడు రేషన్ డీలర్లే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతి నెల వ్యాపారులు లక్షల్లో ముట్టజెప్పడంతో ఇటు పోలీసులు, అటు రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా నుండి వాహనాల్లో పీడీఎస్ రైస్‌ను గూడెం మీదుగా ధర్మపురి, జగిత్యాల, నిజామాబాద్‌కు, మంచిర్యాల నుండి సిరొంచ, మహారాష్ట్ర, గోండియా ప్రాంతాలకు ఎక్కువ తరలిస్తున్నారు. లక్షెట్టిపేట్, దండేపెల్లి, జన్నారం, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు వ్యాపారులు ఊళ్లలో తిరుగుతూ ఇండ్ల నుండి బియ్యాన్ని కొనుకోలు చేసి దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారుల ద్వారా ప్రతి నెల రేషన్ డీలర్లకు చేరుస్తున్నారు. వీటిని కార్డు హోల్డర్స్ అందరికి ఉచితంగా పంపిణీ చేయాలి. కానీ రేషన్ కార్డు ఉండి బియ్యం తీసుకొని వారి బియ్యాన్ని వారి నుండి కేజీ రూ.13చొప్పున డీలర్లే కొని అక్కడే ఉన్న వారి గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన బియ్యాన్ని డిసిఎం వ్యాన్‌ల ద్వారా మహారాష్ట్ర, నిజామాబాద్, సిరొంచ లాంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందాను ప్రధానంగా ఓ వ్యక్తి ప్రోత్సహిస్తున్నట్టు తెలుస్తోంది. చాలా కాలంగా సదరు వ్యక్తి ఈ దందా చేస్తున్నాడు. బియ్యం తరలించే వాహనాన్ని అధికారులు ఆపిన క్రమంలో ఆయన పేరు చెబితే చేసేదిలేక వదిలేస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ వ్యాపారి చేస్తున్న అక్రమ దందాలో కొందరు కూలీలు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలున్నాయి. 20 రోజుల క్రితం సిరొంచ ప్రాంతంలో పీడీఎస్ రైస్ బ్యాగులను తరలించే క్రమంలో బీహార్‌కు చెందిన ఓ కూలీపై బ్యాగులు పడి మృతి చెందాడు. వ్యాపారి విషయం బయటకు పొక్కకుండా ఎక్స్‌గ్రేషియాగా ఎంతోకొంత ముట్టజెప్పి సెటిల్‌మెంట్ చేసుకున్నాడు.



సోమవారం గూడెం చెక్‌పోస్ట్ వద్ద పీడీఎస్ రైస్‌తో దొరికిన వాహనం

సోమవారం రాత్రి దండేపల్లిలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద కొందరు యువకులు బియ్యం తరలించే వాహనాన్ని ఆపి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తర్వాత వాహనంలోని రైస్ బ్యాగులు మారిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు.





జిల్లా కేంద్రంలో పీడీఎస్ బియ్యం బస్తాలను తరలించేందుకు లోడ్ చేసి పెట్టిన వాహనం(ఫైల్)

జిల్లా కేంద్రంలోనే స్థావరాలు

వ్యాపారులు జిల్లా కేంద్రంలోనే స్థావరాలు ఏర్పాటు చేసుకొని పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్, రామ్‌నగర్, గౌతమినగర్, బైపాస్ రోడ్‌లలో స్థావరాలను ఏర్పాటు చేసుకొని బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సమయం దొరికినప్పుడు లోడ్ చేసుకొని వాహనాన్ని తీసుకొని అనుకున్న గమ్యానికి చేరుస్తున్నారు. ప్రభుత్వ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన అధికారులే చోద్యం చూస్తుంటే తామేమీ చేయగలమని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బియ్యం అక్రమ దందాపై దృష్టి సారించి అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని టార్పాలిన్లు, గన్ని బ్యాగులు, తేమ, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే రశీదు ఇచ్చి, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి మద్దతు ధర, కంట్రోల్ రూమ్ నంబరు తదితర వివరాలు తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలన్నారు. వరి ధాన్యాన్ని తీసుకొచ్చినప్పుడే రైతు వద్ద నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా తదితర జిరాక్స్ కాపీలను తీసుకొని త్వరితగతిన వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, సీపీఓ జీవరత్నం, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, డీఎస్ఓ కిరణ్‌కుమార్, డీసీఓ రాజమల్లు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలందరూ బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

పాఠశాలలో చదువుతున్న పిల్లలందరూ తప్పనిసరిగా బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలని సీతారాంపల్లి బ్రాంచ్ టిజిబి మేనేజర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత(ఎఫ్డీఎల్పీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలేని పిల్లలకు సీతారాంపల్లి బ్రాంచ్‌లో ఖాతా అందజేస్తామన్నారు. భావి భారత పౌరులైన పిల్లలు అవినీతి నిర్మూలనకు ఈ దశ నుంచే కట్టుబడి ఉండాలని, అవినీతిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు బ్యాంకు ఖాతాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉండి బ్యాంకు ద్వారా లభించే రుణ సౌకర్యం, వివిధ పథకాలను పొందాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించబడే అన్ని సౌకర్యాలను పొందాలన్నారు. బ్యాంక్ ద్వారా అందిస్తున్న పీఎం ఎస్బివై, పిఎం జెజెబివై ఇన్సూరెన్స్, అటల్ పెన్షన్ యోజన స్కీంలలో తల్లిదండ్రులు ఉండేలా పిల్లలు చెప్పాలని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను పొందేందుకు వారు అర్హులవుతారని తెలిపారు. పిల్లలు పబ్జి మొదలగు ఆటలాడినప్పుడు ఓటీపీ లాంటివి అడుగుతారని అటువంటిది చెప్పకూడదని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శాఖ ద్వారా ఇప్పటివరకు రూ.104 కోట్ల రుణాలను వివిధ పథకాల కింద అర్హులైన ఖాతాదారులకు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ సేవలు, పథకాలపై కళాకారుడు రాజు మిమిక్రీ షో ద్వారా ప్రజలు తెలియజేశాడు. కార్యక్రమంలో పాఠశాల పిఈటి చంద్రశేఖర్, ఎఫ్ఎల్సి కౌన్సిలర్ స్వరూప, బ్యాంకు క్షేత్రాధికారి రవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో జోనల్ స్థాయి పోటీలు లక్షెట్టిపేటలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన క్రీడా పోటీలు రెండో రోజు మంగళవారం కూడా ఎంతో ఉత్సాహంగా సాగాయి. జోనల్ ఆఫీసర్ హెచ్.అరుణకుమారి పర్యవేక్షణలో కొనసాగుతున్న క్రీడా పోటీల్లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని 15 పాఠశాలల నుండి సుమారు 1275 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. అండర్ -14, అండర్-17, అండర్-19 విభాగాలుగా పది అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఓవరాల్ ఇన్‌చార్జి సట్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మల్లిక, 30 మంది పీఈటీ, పీడీల ఆధ్వర్యంలో పోటీలు కొనసాగుతున్నాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, కబడ్డీ తదితర విభాగాల్లో విజేతలను ప్రిన్సిపల్ కె.రమాకళ్యాణి వెల్లడించారు. ఈ నెల 14వరకు జరిగే పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జోనల్ ఆఫీసర్ హెచ్. అరుణకుమారి పర్యవేక్షిస్తున్నారు.

19న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 19న ఝరి పిహెచ్‌సిలో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఆదివాసీ తుడందెబ్బ నాయకులు మెస్రం శేఖర్ బాబు, మడావి చంద్రహరి, పెందోర్ సంతోష్ అన్నారు. నిండు ప్రాణాలను కాపాడడానికి యువత కుల, మత, వర్గ విబేధాలు లేకుండా స్వచ్ఛందంగా మానవత్వంతో అధిక సంఖ్యలో వచ్చి రక్తదానం చేయాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి మెగా రక్తదాన శిబిరాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య



నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. లక్ష్మణచాంద మండలం పీచర గ్రామ కొనుగోలు కేంద్రంలో మంగళవారం సహకార శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన సందర్శించారు. కేంద్రంలో రైతులు తరలించిన ధాన్యం నిల్వలను, వాటి నాణ్యతను, మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకొచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సన్నరకం ధాన్యం ఇప్పటివరకు ఎంత పరిమాణంలో కొనుగోలు చేశారు, ఇంకా ఎంత పరిమాణంలో ధాన్యం కేంద్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగ్స్, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటవెంటనే ధాన్యం కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ప్రతి ఎన్యుమరేటరు సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు తమ పరిధిలోని ఏ ఒక్క ఇంటిని విడిచి పెట్టకుండా సర్వే నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు గ్రామంలో సర్వే పూర్తిచేసిన కుటుంబ వివరాలు, సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు, గ్రామ జనాభా, గ్రామంలోని బ్లాకులు ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో బాధ్యతగా పాల్గొనాలని తెలిపారు. సర్వే లక్ష్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారులు అడిగిన అన్ని వివరాలు తెలియజేసి సర్వే విజయవంతానికి సహకరించాలన్నారు. కార్యక్రమాలలో ఆర్డీవో రత్నకళ్యాణి, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, డీఎస్ఓ కిరణ్‌కుమార్, డీసీవో రాజమల్లు, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఎంపీడీఓ రాధ పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



నస్పూర్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించడంలో ముందుండి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. రాష్ట్రంలోని వనపర్తి జిల్లా దుద్యాల మండలంలో భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓ శ్రీనివాసరావు, హరికృష్ణ, భూసేకరణ ప్రత్యేక అధికారి డి.చంద్రకళ, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వర్, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర ప్రజా సేవలో నిమగ్నమై పని చేసే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై దాడి జరగడం అమానుషమన్నారు. ఉద్యోగ భద్రతపై అధికారులు, ఉద్యోగులు మనోధైర్యం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చట్టాలను మరింత పటిష్టం చేయాలని కోరారు.

కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించి సర్వే తీరును స్వయంగా పరిశీలించారు. ముందుగా కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని రిక్షాకాలనీ, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి పర్యటించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు, సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో ఆ ప్రాంత ప్రజలకు సమాచారం అందించాలని అన్నారు. ఇంటి యజమానులు అవసరమైన అధార్, రేషన్ కార్డులు, ధరణి పాస్‌బుక్ పత్రాలతో సిద్ధంగా ఉండేలా వారికి తెలియజేయాలని తెలిపారు. ఫారంలో ఉన్న ప్రశ్నలకు ఎన్యుమరేటర్లు ప్రతి అంశాన్ని తప్పనిసరిగా నింపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, అశోక్, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలన్నీ నమోదు చేయాలి

నస్పూర్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో జిల్లాలోని కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల 13, 27 వార్డులలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టిన కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్లలో పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని, నమూనాలో ఉన్న అన్ని అంశాలను పూరించాలని తెలిపారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజు సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

- కేసులో బాలుడి హస్తం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని దస్నాపూర్‌లో గల మిస్టర్ టీ రెస్టారెంట్‌లో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మంగళవారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నవంబర్ 3న రాత్రి మిస్టర్ టీ రెస్టారెంట్‌లో దొంగతనం జరిగింది. దొంగతనం చేసిన కుంబోజు రాజేష్, అతనికి సహకరించిన బాలుడిని పట్టుకొని వారిద్దరి దగ్గర నుండి రూ.5వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రెండో వ్యక్తి అయిన బాలుడు అదే రెస్టారెంట్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. అతని సహకారంతో కుంబోజు రాజేష్ రూ.15వేలు దొంగతనం చేశాడు. దొంగతనం చేసిన డబ్బులను జల్సాలకు ఖర్చు పెట్టుకోగా మిగిలిన రూ.5050 స్వాధీనం చేసుకున్నారు. కుంబోజు రాజేష్‌ను రిమాండ్‌కు తరలించారు. బాలుడిని జువెనైల్ హోంకు పంపించారు. వ్యాపారస్తులు ఎవరూ కూడా తమ దుకాణాల్లోని కౌంటర్లలో డబ్బులు ఉంచి రాత్రిపూట తాళం వేసుకొని వెళ్లొద్దని ఈ సందర్భంగా సీఐ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో కౌంటర్లో ఉన్న డబ్బులను తీసుకొని వెళ్లాలన్నారు. గత నెలలో సాగర్ సూపర్ మార్కెట్లో జరిగినటువంటి దొంగతనంలో కూడా ఆ షాప్‌లో పనిచేసే వర్కర్ దొంగతనం చేసినట్లు తెలిపాడు. దుకాణదారులు షాప్‌లో పనిచేసే వర్కర్లపై, వారి కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | నవంబర్ 13, 2024 | www.navatelangana.com

కులగణనలో పాల్గొన్న మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శంబు గూడ గ్రామంలో అడ రాజు పటేల్ ఇంట్లో కులగణన సర్వేలో భాగంగా మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ పాల్గొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమగ్ర కుటుంబ సర్వే వివరాలు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అడ రాజు పటేల్, ఉపాధ్యాయులు పెందోర్ కాశీరాం, కుడ్మేత విర్షన్, పెందోర్ ఇశ్రు, అడ మోతీరాం పాల్గొన్నారు.



సమగ్ర సర్వేకు వివరాలు వెల్లడించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులకు వివరాలు వెల్లడించాలని తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వేను పరిశీలించారు. ఇంటివచ్చిన అధికారులకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాలు వెల్లడించి, ప్రజలంతా సహకరించాలన్నారు. అనంతరం వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ వెంట రికార్డు అసిస్టెంట్ రాకేష్, ఎన్యూమరేటర్ సాయేందర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



ఇరిగేషన్ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ సమీపంలోని రైతుల పంటల సాగు కోసం 130 సంవత్సరాల కింద కాలువపై నిర్మించిన అలుగును కూల్చివేసి అదే స్థానంలో మళ్లీ నూతనంగా నిర్మిస్తామని ఇరిగేషన్ అధికారులు జేసీబీ సహాయంతో అలుగును కూల్చివేసే సమయంలో నచ్చన్‌ఎల్లాపూర్, లింగాపూర్ గ్రామస్తులు అధికారులను అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. తమ గ్రామంలోని కాల్వపై నిర్మించిన అలుగును కూల్చివేస్తే నచ్చన్‌ఎల్లాపూర్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఘటన స్థలానికి కడెం ప్రాజెక్టు ఈఈ విఠల్ రాథోడ్ చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి కూల్చివేసిన స్థానంలో మళ్లీ నూతనంగా అలుగులు ఏర్పాటు చేసి, రబి పంటకు నీరందిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీఓఏ ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలనే డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ వీఓఏల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 48 గంటల సమ్మెలో రెండో రోజు మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని ఆరోపించారు. బకాయిలో ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్‌లు గ్రామ సంఘాలకు ఇవ్వాలని, గ్రామ సంఘం నుంచి రూ.3వేల వేతనం చెల్లించాలని, ప్రతి నెల సక్రమంగా వేతనాలు అందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక నెల వేతనం రాకపోతే ఇబ్బందులు పడుతున్నారని, అదే చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీఓఏలకు నెలల తరబడి వేతనాలు అందించడం లేదన్నారు. గ్రామ సంఘాలలో ల్యాప్‌ట్యాప్‌లు లేక ఆన్‌లైన్ పనులకు ఫోన్లు సపోర్ట్ చేయక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్లు ఇవ్వాలని అన్నారు. గ్రామ సంఘం పుస్తక నిర్వహణ కొరకు ఎంపిక చేసిన వీఓఏలకు నేడు అనేకరకాల పనులు చేయిస్తున్నారని, ఎస్‌హెచ్‌జీ ఏఓ అంకౌంటింగ్, ఎస్‌ఆర్‌ఎల్‌ఎం యాప్, లఘుపతి దీదీ లోకోస్ యాప్లతో ఆన్‌లైన్ పనులు ఎలాంటి సౌకర్యం లేకుండా చేపిస్తూ రోజు రోజుకి పని భారం పెరుగుతుందన్నారు. వీఓఏలు అనారోగ్యంతో, ప్రమాదాల వలన మరణిస్తున్నారని, కనీస బీమా సౌకర్యం లేక వీఓఏల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరి సమస్యలను పరిష్కరించడంతో పాటు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దర్శనాల అరుణ్, లక్ష్మణచారి, ఫెరోజ్, రాజేష్, బారిక్ రావ్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హిందీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం టీయూటీఎఫ్ ఆదిలాబాద్ అర్బన్ మండల శాఖ తరఫున సన్మానించారు. ఇటీవల జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభలో అధ్యక్షుడిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయనను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మండల అధ్యక్షులు సంజయ్, గంద్రత్ నారాయణ యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి, రాజకీయ, సమగ్ర కుల గణన సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రాష్ట్ర స్పెషల్ అధికారి కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సర్వేలో పాల్గొని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పట్ల సామాజిక మధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలేవరూ నమ్మొద్దని అన్నారు. సర్వే చేస్తున్న అధికారులు తప్పులు చేయకుండా పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సబ్బండ వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి, రాజకీయ రంగాల్లో న్యాయం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్, శిక్షణ కలెక్టర్, ఎంపీడీఓ, ఎంపీపీ, తహసీల్దార్, మండల స్పెషల్ అధికారి, సూపర్‌వైజర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని కేబి కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలో శాశ్వత ప్రాతిపదికన లెక్చరర్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తాని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉట్నూర్ బీఈడీ కళాశాల స్థాపించి 16 సంవత్సరాలు అవుతుందన్నారు. ఇప్పటి వరకు రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయలేదని, వేలది మంది గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యా అందించే బీఈడీ కళాశాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, రెగ్యులర్ అధ్యాపకులను ప్రభుత్వం నియమించక పోవడంతో కళాశాల భవిష్యత్ ప్రశ్నర్థకంగా మారిందని, తక్షణమే శాశ్వత ప్రాతిపదికన ప్రిన్సిపాల్, లెక్చరర్, ఇతర పోస్టులను భర్తీ చేసి, బీఈడీ కళాశాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తొడసం భీంరావు, మండలాధ్యక్షులు కనక మలుకు, కార్యదర్శి మడవి నాగోరావ్ పాల్గొన్నారు.

శ్రమకు దక్కిన ఫలితం.. నేవీలో ఉద్యోగం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



తండ్రి పుట్టుక నుంచి మూగ, రోజూ పని చేస్తేనే గాని పొట్ట గడవని కుటుంబ పరిస్థితి, రజక కులం కావడంతో రోజు బట్టలు ఉతికి పొట్టపోసుకునే శ్రీరాంనగర్ కాలనీకి చెందిన నిమ్మల నర్సయ్య కమారుడు నిమ్మల సాగార్ నేవీలో ఉద్యోగం సాధించి ఔరా అనిపించాడు. చదివించే స్తోమత లేని పేదరికంలో ఉన్న నర్సయ్య ఎంతో కష్టపడి కుల వృత్తితోనే తన ఇద్దరు కమారులను చదివించాడు. నాలుగవ తరగతి వరకు స్థానికంగా చదివిన పెద్ద కుమారుడు సాగర్ 5 నుంచి లక్షెట్టిపేట్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. నేవీలో ఉద్యోగ ప్రకటన వెలువడగానే దానికి దరఖాస్తు చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉద్యోగానికి అవసరమైన తర్ఫీదు తీసుకొని నేవీలో ఉద్యోగం సాధించాడు. మూడు రోజుల కింద ఒడిస్సా రాష్ట్రం వెళ్లిన సాగర్ నేవీ ట్రైనింగ్‌లో ఉన్నాడు. కడు పేదరికం ఏమాత్రం సమాజ పోకడ తెలువని మాటలు రాని నర్సయ్య కుమారుడు సాగర్ మంచి వేతనంతో కూడిన, గౌరవ ప్రదమైన ఉద్యోగం సాధించడాన్ని శ్రీరాంనగర్ వాసులు అభినందిస్తున్నారు. పట్టుదలతో ఉద్యోగం సాధించిన నిమ్మల సాగర్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరుతున్నారు.

కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం..

- నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-సిరికొండ

ఔషద పరిశ్రమల ఏర్పాటుకు నిర్వహించ తలపెట్టిన గ్రామసభకు వచ్చినటువంటి వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై గ్రామస్తులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల తహసీల్దార్ తుకారాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అధికార యంత్రాంగానికి కలెక్టర్ బాస్ అని అటువంటి కలెక్టర్‌పై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికారులపై ఎంత వ్యతిరేకత ఉన్నా ఇటువంటి దాడులు చేయడం సరికాదని అన్నారు. ఇటువంటి దాడులు జరిగితే అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లి పనులు చేయడం సాధ్యం కాదని అన్నారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఉపేందర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విలాస్, సీనియర్ అసిస్టెంట్ ఉమారాణి, సర్వేయర్ గణేష్, జూనియర్ అసిస్టెంట్ అముల్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : హైదరాబాద్‌లోని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మండల రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్‌లు మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా గ్రామానికి వెళ్లిన కలెక్టర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అలాంటప్పుడు తాము విధులకు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌కే రక్షణ లేకుంటే సాధారణ కింది స్థాయి ఉద్యోగుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే దాడికి పాల్పడిన వారిని పట్టుకుని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఆర్ఐ.లక్ష్మణ్, అచ్యుత్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలతో పాటు ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలు, ఓటు హక్కుపై ఆయా పాఠశాలల విద్యార్థులు నాటికలు ప్రదర్శించారు. నాయకుడిని ఏ విధంగా ఎన్నుకోవాలో వివరిస్తూ ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుపై విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వీటిపై క్షేత్రస్థాయిలో చర్చ జరగాలనే ఉద్దేశంతో విద్యార్థులతో నాటిక ప్రదర్శన ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 28, 29న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని భీంజీగూడ గ్రామంలో మహాసభల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటాలను చేస్తుందన్నారు. ఈ జిల్లా మహాసభల్లో భవిష్యత్ ఉద్యమం గురించి చర్చించేందుకు మహాసభలను నిర్వహిస్తుందన్నారు. ఈ మహాసభలకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, నాయకులు కనక మల్కు, మడవి నాగోరావ్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో మెరిసిన గిరిజన విద్యార్థులు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల జిల్లా తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన జోనల్ స్థాయి అండర్-14 విభాగం వాలీబాల్ పోటీలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లా జట్టు తరఫున పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి జుగాది రావ్‌కు ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీడీ రాథోడ్ రవీందర్‌ను మంగళవారం పాఠశాలలో సిబ్బంది సన్మానించారు. సన్మానించిన వారిలో ప్రధానోపాధ్యాయులు రాథోడ్ బలిరాం, వార్డెన్ దీప్ సింగ్, ఉపాద్యాయ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య జీవన శైలి కోసమే 'ఆరోగ్య పాఠశాల'

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసేందుకు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం కోసం రూపొందించిన కార్యక్రమమే ఆరోగ్య పాఠశాల అని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం రిమ్స్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నవంబర్ 14 వ తేదీ నుంచి అన్ని ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీ, ఇంటర్ కళాశాలల్లో ప్రారంభం కావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కో వారం ఒక్కో అంశాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి మంగళవారం పోషకాహారంపై అవగాహన, ప్రతి బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, ప్రతి గురువారం డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, ప్రతి శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, ప్రతి శనివారం వ్యక్తిత్వ వికాసం ఈ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని తెలియజేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే విద్యా నైపుణ్యాలను సాధించగలరని అందుకోసం ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్ఓ డా. నరేందర్ రాథోడ్, డీఈఓ ప్రణీత, జిల్లా సంక్షేమ అధికారి సబిత, స్త్రీ శిశుసంక్షేమ అధికారి మిల్కా, డీఐఈఓ రవీందర్, ప్రధానోపాధ్యాయులు, నోడల్ ఉపాధ్యాయులు కేజీబీవీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, విషయ నిపుణులు పాల్గొన్నారు.

108లో పైలట్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఖానాపూర్

ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108లో పైలెట్ ఉద్యోగాల నియామకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గాదం మధుకర్ జిల్లా కోఆర్డినేటర్ లింగాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫైర్ స్టేషన్ లోకేషన్ నిర్మల్ జిల్లా 108 అంబులెన్స్ కార్యాలయంలో ఇంటర్వ్యూ కొనసాగుతుందన్నారు. ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జీరాక్స్ పత్రాలను తీసుకురావాలని సూచించారు. వయస్సు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండాలని, అర్హతలు 10వ తరగతి పాసై ఉండాలని, ఎత్తు 5.5 ఉండాలని పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ అండ్ బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. 5 సంవత్సరాల అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9177449022, 9676757584, 9440252141 ఈ కింది నెంబర్లను సంప్రదించాలన్నారు.

పులి సంచారంపై గ్రామాల్లో అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

జిల్లాలోని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుండటంతో ఖానాపూర్‌లో ఆ శాఖ అధికారులు అటవీ సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మంగళవారం అందులో భాగంగానే అటవీ సమీప గ్రామాలైన నాగాపూర్, సత్తనపెల్లి, తర్లపాడ్, సోమార్‌పేట్, బీర్నంది, రాజూరా, ఎక్బాల్‌పూర్ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. పులి దాని స్థావరానికి చేరుకుందనే సమాచారం వచ్చేదాక ప్రజలు అటవీ ప్రాంతానికి పోవద్దని ఖానాపూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కిరణ్ సూచించారు. అటవీ సమీపంలో ఉండే వ్యవసాయ క్షేత్రాల్లో ఏవైనా పనులు ఉంటే రైతులు వాయిదా వేసుకోవాలని కోరారు. తమ సిబ్బంది సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. పులి సంచారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం గ్రామానికి చెందిన శంకరమ్మ ఇల్లు గత నాలుగు రోజుల కింద షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట గ్రామస్తులు అశోక్, రాజేశ్వర్, అఫ్సర్, లక్ష్మారెడ్డి, సిరం వంశీ, దినేష్‌రెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

చివరి గింజ వరకు వరి కొనుగోలు చేస్తాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో చివరి గింజ వరకు వరి పంట కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ నరసింహారావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి రబ్బాని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో 34 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 21 ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో, 13 మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 40000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఆసిఫాబాద్‌లో పంట కొంత ఆలస్యంగా వస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడే పంట కోతకు వచ్చిందన్నారు. పంట చేతికి రావడానికి మరో 15 రోజులు పట్టే అవకాశం ఉందన్నారు. వరి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే సెంటర్‌కు పంట తెచ్చే సందర్భంలో 17శాతం మాత్రమే తేమ ఉండేలా చూసుకోవాలని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

గేదెను ఢీకొన్న ఆర్టీసీ బస్

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని రుద్రాపూర్ గ్రామ శివరులో మంగళవారం ఉదయం ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్(టీఎస్01యూబీ 2886) గేదెను ఢీకొనడంతో గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్ బస్సును ఆపగా, వెంటనే గెదే యజమాని బస్సు డ్రైవర్‌ని విచారించే సమయంలో ఆటో డ్రైవర్, బస్సు డ్రైవర్ కించపరుస్తూ మాట్లాడడంతో వారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బస్సు కండక్టర్ కల్పించుకొని గేదెకు అయ్యే వైద్య ఖర్చులను భరించుకుంటామనడంతో వివాదం సద్దుమణిగింది. ఇంతకుముందు కూడా అదే స్థలంలో ఆర్టీసీ బస్సు గొర్రెను యాక్సిడెంట్ చేసి వెళ్లిపోయిన ఘటనలుయని స్థానికులు తెలిపారు.

ఆదివాసులకు అన్యాయం చేసే యోచన విరమించుకోవాలి

- సీపీఐ (ఎం) మహాసభల్లో తీర్మానం
- 9 అంశాలపై ఏకగ్రీవం తీర్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 9 నుండి 11 వరకు కాగజ్‌నగర్‌లో నిర్వహించిన సీపీఐ (ఎం) జిల్లా 3వ మహాసభలలో పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మొత్తం 9 అంశాలపై తీర్మాణం చేశారు. టైగర్ కారిడార్ పేరుతో ఆదివాసులు, ఇతర పేదలకు అన్యాయం చేసే యోచనను విరమించి, గిరిజన గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తీర్మాణం చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కాగజ్‌నగర్‌లో సాంకేతిక విద్యాసంస్థ నెలకొల్పాలని తీర్మాణించారు. సింగరేణి ప్రయివేటీకరణ విధానాన్ని ఆపి, స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని, అదేవిధంగా సిర్పూరు పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని తీర్మాణించారు. కుమురంభీం ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి నీటిని ఉపయోగంలోకి తీసుకురావాలని, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి చేసి భూములకు సాగునీరు అందించాలని తీర్మాణించారు. కాగజ్‌నగర్ పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని, జిల్లాలో మత గొడవలు సృష్టిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి కమిటీలు ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని కాపాడాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

గిరిజన ఆశ్రమ పాఠశాలలో గతంలో జరిగిన ఫుడ్ పాయిజన్ సంఘటనలో 60 మంది విద్యార్థులు అవస్థకు గురికావడంతో చాలామంది విద్యార్థులు భయంతో ఇంటి ముఖం పట్టారు. అవస్థకు గురైన 60 మంది విద్యార్థుల్లో ముగ్గురికి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతుంది. దీంతో తల్లిదండ్రులు మళ్లీ ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడంతో హాస్టల్ మొత్తం ఖాళీ అయ్యే ప్రమాదం ఉండడంతో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ హాస్టల్‌ను సందర్శించి జరిగిన విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ఈ సంఘటన ఎలా జరిగిందని అటు అధికారులు కానీ, ఇటు సంబంధిత శాఖ అధికారులు కానీ వెల్లడించకపోవడంతో భయాందోళనలతో విద్యార్థులు పాఠశాల నుండి వెళ్లిపోయారు. ఫుడ్ పాయిజన్ నిజ నిర్ధారణతో కమిటీ వేసినా ఇప్పటివరకు దానిపై దీనికి బాధ్యులెవరనేది తేలకపోవడంతో అన్ని కోణాల్లో విచారణ జరిపించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అదనపు కలెక్టర్ అన్నారు. మీడియాకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. అధికారులు కూడా నిరాకరించారు. కనీసం ఫోటోలు కూడా తీయడానికి వీలు కల్పించకుండా లోపలే విచారణ జరిపి వెళ్లిపోయారు. ఆయన వెంట డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవీ, తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరాలకు స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాలకు మంచి స్పందన లభించింది. కిమ్స్ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి 17 మంది కంటి బాధితులు హాజరు కాగా ఏడుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజాలైఫ్‌కేర్ ఆస్పత్రిలో..

అదేవిధంగా ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాలైఫ్ కేర్ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా 15 మంది బాధితులు హాజరయ్యారు. వీరిలో 8 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కంటి శుక్లాలున్న వారు, కంటి చూపు మందగించిన వారు ప్రతి మంగళవారం నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-వాంకిడి

విద్యార్థి దశ నుండే బాలలు వారి హక్కులు, రక్షణ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇందానీ గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. వారి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, మధ్యలో ఎదురయ్యే సమస్యల గురించి ఆత్మస్థైర్యంతో ఎదుర్కొవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి దినేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రవళీ, సూపర్‌వైజర్‌లు ఝాన్సీరాణి, నసీర్ ఉస్మానీ, పీతాంబర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలందక ఆరు నెలలు

- ఇబ్బందుల్లో అవుట్ సోర్సింగ్ ఏఈఓలు
- జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం
- వేతనాలు చెల్లించాలని వేడుకోలు



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక నెల వేతనం రాకపోయిన తట్టుకోలేని పరిస్థితి. అసలే చాలీచాలని వేతనంతో విధులు నిర్వహిస్తున్న వారికి ఏకంగా ఆరు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో వారు బాధలు చెప్పాలేము. వారు విధులు గురుతరమైన బాధ్యత నిర్లక్ష్యం వహించకుండా నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఏఈఓలకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని 22 మంది అవుట్ సోర్సింగ్ ఏఈఓలు ఉన్నారు. రెగ్యులర్ ఏఈఓలు డిజిటల్ చేయమని ప్రభుత్వానికి తేల్చి చెప్పినప్పటికీ, కాంట్రాక్ట్ ఏఈఓలు డిజిటల్ క్రాఫ్ట్ సర్వేను చేస్తూ వీసీలకు ఎప్పటికప్పుడు అటెండ్ అవుతూ రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. అయిన వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. గత జూన్ నుండి సుమారు 6 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకుపోవడం శోచనీయమని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు లేక ఇల్లు గడవడమే కష్టంగా మారుతుందన్నారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు ఉన్నత అధికారులకు చెప్పిన ఎలాంటి స్పందన రావడం లేదని చెబుతున్నారు. ఆరు నెలల పాటు తమతో పని చేయించుకుంటున్న ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే చేయకుంటే విధుల నుండి తొలగిస్తామని హుకుం జారీ చేసిన ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. రైతు వేదికల్లో కనీసం స్వీపర్ కూడా లేక తామే ఆ పని చేసుకోవాల్సి వస్తుందంటున్నారు. అన్ని తామై రైతులకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న తమకు ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని 22 మంది అవుట్‌సోర్సింగ్ ఏఈఓలు విధులు నిర్వహిస్తున్నారు. ఒక క్లస్టర్‌కు సుమారు 5000 ఎకరాల డిజిటల్ క్రాఫ్ట్ సర్వేను చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వాటిని తూచా తప్పకుండా పాటిస్తున్న తమకు వేతనాలు అందడం లేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాన్ని చెల్లించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటం

- వీఓఏల సంఘం గౌరవాధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కలెక్టరేట్ ఎదుట దీక్షలో ఐకేపీ వీఓఏలు, సీఐటీయూ నాయకులు

48 గంటల దీక్షతో ఐకేపీ వీఓఏల వాణిని రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించామని సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. 48 గంటల దీక్ష ముగింపు సందర్భంగా డీఆర్డీఓకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలని, గ్రామ సంఘాల నుండి ఐకేపీ వీఓఏలకు రావాల్సిన రూ.3,000ల వేతనం ఇవ్వాలని, ఎన్నికల హామీ ప్రకారం రూ.20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఎస్‌హెచ్‌జీ, వీఓ అంకౌంటింగ్, ఎస్ఆర్ఎల్ఎం యాప్, లఘుపతి దీదీ లోకోస్ యాప్‌లతో ఆన్‌లైన్ పనులు ఎలాంటి సౌకర్యం లేకుండా చేయించడంతో పని భారం పెరుగుతుందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుద్ధు, రోజా మాట్లాడుతూ వీఓఏలు అనారోగ్యం, ప్రమాదంతో మరణిస్తున్నారని, కనీస బీమా సౌకర్యం లేక తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణీ, తెలంగాణ ఐకేపీ ఉద్యోగులు రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, నాయకులు సంతోష్, రవీందర్, సతీష్, శ్రీనివాస్, ధనరాజ్, తిరుపతి, మహేశ్వరి, సంతోష్, వనిత, ఆనందరావు, మధుకర్ పాల్గొన్నారు.

అధికారులపై దాడిని ఖండిస్తూ నిరసన



ఆసిఫాబాద్ : కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వనపర్తి జిల్లాలో దుద్యాల మండలంలో భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు అధికారులపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులపై దాడికి పాల్పడ్డారని, ఈ నేపథ్యంలో సామాన్య ఉద్యోగికి భద్రత లేదని, అధికారులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ల సంఘం నాయకులు మధుకర్, ప్రమోద్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కెరమెరి : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ భూసేకరణపై ప్రజా అభిప్రాయాల సేకరణకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై గ్రామస్తుల దాడికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సైతం దాడికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీఓ అంజత్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఆర్ఐ పవన్ నాయక్ శేవంత, విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

వాంకిడి : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో విలేజ్ ఫార్మా కంపెనీ కోసం భూ సేకరణలో భాగంగా గ్రామస్తులతో అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్, ప్రత్యేకాధికారిపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామస్తులతో చర్చించి వారి అభిప్రాయాన్ని ప్రభుత్వానికి పంపడానికి వెళ్లారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్న ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ జావిద్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కెరమెరి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



వాంకిడి : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కార్యాలయం సిబ్బంది

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటు పాడాలని మండల విద్యాశాఖాధికారి గావుడె హనుమంతు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో రెండవ తరగతి పిల్లలకు ఉపాధ్యాయురాలు సీహెచ్ మమత పాఠాలు బోధిస్తున్నారు. ఎంఈఓ పిల్లల సామర్థ్యాలను పరిశీలించగా పిల్లలు చురుకుగా సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలీని అభినందించారు. ఇలాగే పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. రాగి జావ పిల్లలకు సకాలంలో అందించాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం వడ్డించాలని హెచ్ఎం గణపతికి ఆదేశించారు. మండలంలో ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ పాటించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న ఉన్నారు.



రైతు నేస్తం సద్వినియోగం చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నాగరాజు
- సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

నవతెలంగాణ-బెజ్జూర్



ప్రతి మంగళవారం రైతు వేదికలో నర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియెగం చేసుకొవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజుల సూచించారు. దీనిపై రైతులకు సరైన అవగాహన లేక నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయంలో కొత్తకొత్త పద్ధతులపై రైతు నేస్తం కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారన్నారు. దీంతో రైతులకు మేలైన విత్తనాలు ఎంపిక చేసుకొవడం, ఎరువల వాడకంపై పూర్తి అవగాహన లభిస్తుందన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని పొందవచ్చన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తాన్నారు. ఎలాంటి సమయయంలోనైన రైతులు సంప్రదించవచ్చన్నారు. శిక్షణ పూర్తి చేసుకొని కార్యాలయంలో విధులకు హాజరు అవుతున్నాని పేర్కొన్నారు. గత ఏట అందించిన విధంగా రైతులకు సేవలు అందిస్తానన్నారు. కొత్త రకం వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు సేంద్రియం ఎరువుల వాడకాన్ని రైతులకు వివరిస్తానన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం ఎంతో గొప్పదని, దానిని రైతులు అందిపుచ్చుకునే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం చూస్తే రైతులకు వ్యవసాయంపై పట్టు లభిస్తుందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం పామ్ ఆయిల్ సాగుకు సబ్సిడి ఇస్తుందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభంతో పాటు ప్రభుత్వ సబ్సిడిని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడే విధంగా పంట క్షేత్రల్లో అవగాహనతో పాటు చైతన్య కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ప్రతి కుటుంబ వివరాలు నమోదు చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లాలోని ప్రతి కుటుంబం వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ధిత నమూనాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. అందుబాటులో లేని వారి ఇంటికి మరోసారి సందర్శించాలని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని సూచించారు. సర్వే లక్ష్యాన్ని సాధించాల్సిన బాధ్యత ఎన్యుమరేటర్లపై ఉందన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు, సర్వే సిబ్బంది ఉన్నారు.

రెబ్బెన : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, సమగ్ర కుల గణన సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గోలేటి గ్రామంలో కుల గణన సర్వేను వారు పరిశీలించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా నిలబెట్టేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో కుల గణన చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరమ్మ, కాంగ్రెస్ గోలేటి పట్టణ అధ్యక్షుడు పల్లాస్, నాయకులు సంగెం ప్రకాష్ రావు, సాంబగౌడ్, దుర్గం రవీందర్, బానోత్ సుబ్బారావు, బాలు నాయక్, పర్వతి సాయి, మహేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఎల్ఎస్ఏ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టెనో టైపిస్ట్-1, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానం కుమురంభీం ఆసిఫాబాద్‌కు చేరే విధంగా రిజిస్టర్డ్ పోస్ట్, కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలని, నేరుగా దరఖాస్తులు స్వీకరించబడవని, అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్ట్ వివరాలు కవర్‌పై తప్పనిసరిగా రాయాలని సూచించారు. ఈ నెల 23 నుండి 28 వరకు దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన అభ్యర్థులకు డిసెంబర్ 2న హాల్ టికెట్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 7న ఉదయం 10.30 గంటలకు రికార్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం 3 గంటలకు స్టెనో టైపిస్ట్, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవన సముదాయంలో రాత పరీక్ష ఉంటుందన్నారు. ఏ స్థాయిలోనైనా సదరు నోటిఫికేషన్‌ను రద్దు చేసే అధికారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కలిగి ఉంటారని, ఇతర వివరాలకు ఆసిఫాబాద్.డీకోర్ట్స్.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల పర్యటన

నవతెలంగాణ-రెబ్బెన

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యులు మంగళవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. బెల్లంపల్లి జీఎం ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధిపతులతో వార్షిక ప్రణాళికపై చర్చించారు. కార్పొరేట్ అండ్ ప్లానింగ్ జీఎఓం ఎ.మనోహర్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం కె సాయిబాబు, మార్కెటింగ్ జీఎం డిజరవిప్రసాద్, ఏజీఎం(ఐఈ) సీహెచ్ వెంకయ్య, మార్కెటింగ్ డీజీఎం సురేందర్ రాజు, అడిషనల్ మేనేజర్ దిలీప్ కుమార్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్పత్తి, ఉత్పాదకతకు అవసరమయ్యే యంత్రాలు, పరికరాల వివరాలను తెలుసుకున్నారు. ఖైరిగూడ ఓసీకి చేరుకొని పని స్థలాలను చూశారు. వట్టివాగు రక్షణ కట్ట, ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్ళే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీఓ ఎం.నరేందర్, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

4

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

బుధవారం | నవంబర్ 13, 2024 | www.navatelangana.com

కోతుల బెడద పరిష్కరించాలని గ్రామస్తుల ర్యాలీ

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండల కేంద్రంలో కోతుల బెడద పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మంగళవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. జాతీయ రహదారి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన గ్రామస్థులు కోతుల దాడిలో గాయపడిన వారు, నష్టపోయిన వారు తమ సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీలో వివరిచారు. కోతులతో జరుగుతున్న నష్టానికి అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కోతుల సమస్య పరిష్కరించకుంటే గ్రామస్థులు ఎవ్వరు ఇంటి పన్ను, నల్లా బిల్లులు చెల్లించమని తేల్చి చెప్పారు.

హోమ్ డెలివరీ సేవలు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల



టీఎస్ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేసిన హోమ్ డెలివరీ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని మంగళవారం ఆర్టీసీ కార్గో ఉద్యోగులు బస్టాండ్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. హైద్రాబాద్ లాంటి దూర ప్రాంతాలలో ఉండే వారి కోసం హోమ్ డెలివరీ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని 131 ఏరియాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మాడవి దేవాసాల, మార్కెటింగ్ ఎక్సిక్యూటివ్‌లు మహేష్, రమేష్, ఇన్‌చార్జి అశోక్ రావు పాల్గొన్నారు.

డాక్టర్లు సమయపాలన పాటించాలి

- మంచిర్యాల జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్



నవతెలంగాణ-తాండూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యుల, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు వైద్యాన్ని అందించాలని డీఎం అండ్ హెచ్ఓ హరీష్ రాజ్ సూచించారు. మంగళవారం బెల్లంపల్లి ఆస్పత్రిలో తాండూర్, తాళ్ల గురజాల, నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఏఎన్ఎం సూపర్‌వైజర్లు అడ్వాన్స్ టూర్ డైరీ రాసి యాక్షన్ ప్లాన్ ప్రకారం గ్రామాలను నుసందర్శించాలని తెలిపారు. గిరిజన మారుమూల ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. గర్భిణీలు బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ వారికి వైద్య ఆరోగ్య సలహాలు అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు వైద్య సిబ్బంది వివరాలతో కూడిన బోర్డులను ఉంచాలని తెలిపారు. సీటిజన్ చార్ట్ మందుల వివరములను తెలియజేసే విధంగా జాబితాను ప్రదర్శించాలన్నారు. వైద్యాధికారులు సబ్ సెంటర్ల సిబ్బందితో జూం మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ అనిత, డాక్టర్లు సుధాకర్, ప్రసాద్, సీతారామరాజు పాల్గొన్నారు.

ఆర్కే-న్యూటెక్ గనిలో టీబీజీకేఎస్ నూతన ఫిట్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-న్యూటెక్ గనిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన పిట్ కమిటీని కార్యకర్తల సమక్షంలో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ కలిసి ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా ఉప్పల సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా జైపాల్‌రెడ్డి, జనరల్ షిఫ్ట్ సెక్రటరీగా అట్లూరి అనిల్ కుమార్,ఏబీసీ రిలే అడ్డూరి అనిల్, రాజ్ కుమార్, జై కృష్ణ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజుతో సహా 50 మంది సభ్యులతో పూర్తి ఫిట్ కమిటీని నియమించడం జరిగిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఎండీ లాల, గోనె స్వామి, బుద్ధి ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 14,15వ తేదీల్లో నిర్వహించే యూఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ మొట్టమొదటి అఖిల భారత మహాసభలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం 1984 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ పోరాటల గడ్డమీద ఏర్పడిందని, అధ్యయనం ఐక్యత పోరాటం అనే నినాదంతో ముందు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు సరిత, రమ్య, మేఘన, రమేష్, క్రాంతికుమార్, రవితేజ, భీమేష్ పాల్గొన్నారు.

ట్రస్మ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేంద్రప్రాణి

నవతెలంగాణ-నస్పూర్



ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లెత్తుల రాజేంద్రపాణి ఎన్నికయ్యారని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. హైదరాబాదులో ట్రస్మా రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ట్రస్మా బాధ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లెత్తుల రాజేంద్రపాణి గత 30 సంవత్సరాలుగా ప్రైవేటు పాఠశాలల అభివృద్ధి కోసం చేస్తున్న కృషి వల్ల ఈ పదవి వరించిందని, గతంలో జిల్లాలోని సింగపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పనిచేసి ఎంతోమంది ప్రజల ఆధార అభిమానాలు చురగున్నారన్నారు. ఈ సందర్భంగా మల్లెతుల రాజేంద్ర పాణి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్‌రెడ్డి, రాష్ట్ర సెక్రటరీ అనిల్ కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లాకు చెందిన పెట్టం మల్లయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, లక్షెట్టిపేటకు చెందిన చిందం చంద్రశేఖర్‌ను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. ఎన్నికైన జిల్లా నాయకులు జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు. వీరి ఎన్నిక పట్ల జిల్లాలోని ట్రస్మ నాయకులు, జిల్లా కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాభవన్ ముట్టడిస్తాం

నవతెలంగాణ-నస్పూర్



ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ హెచ్చరించారు. 48 గంటల మహా ధర్నాలో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మార్లు రాష్ట్ర మంత్రులకు, ఏమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చిన ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అదే విదంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హమీ ప్రకారం రూ.20వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే అధికారుల వేధింపులు ఆపాలని, గ్రేడింగ్ విధానం, సోషల్ అడిట్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, జిల్లా కోశాధికారి పొట్ట పోశం, జిల్లా కమిటీ సభ్యులు రజిత, అనిత, శారదా, మహేష్, దాసు, వెంకటి, సమ్మన్న, తుకారాం, రాజ్యలక్ష్మి, భాగ్య లక్ష్మి, అనూష, లక్ష్మన్, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

వచ్చే జనవరి ఒకటవ దీది నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఈఆర్‌ఓలు శ్రీనివాసరావు, హరికృష్ణ, డి చంద్రకళలతో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పరిశీలకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు ఇది మంచి సమయమని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, స్పష్టమైన జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల సహకారం అవసరమని అన్నారు. జాబితాలో రెండు, మూడు ఎపిక్ కార్డులు కలిగిన, చిరునామా మారిన, మరణించిన వారి వివరాలు మార్పులు, సవరణలు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకే కుటుంబానికి సంబంధించి కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా జాబితా రూపొందించాలని, వారాంతపు సమావేశాలు నిర్వహించి 2, 3 వారాలలో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులపై విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని, నూతన ఓటరు నమోదుపై ప్రత్యేక దష్టి సారించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకునేందుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకుంటుందని, ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-తాండూర్



వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు బెల్లంపల్లి తహసీల్దార్ జోష్న తెలిపారు. మండలంలోని ఆరు కొనుగోలు కేంద్రాలకు గాను మంగళవారం నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. బెల్లంపల్లి సహకార సంఘం పరిధిలో ఆకనపల్లి, చాకెపెల్లి కొనుగోలు కేంద్రాలను, ఐకేపీ పరిధిలోని ఆకనపల్లి పెద్దదుబ్బ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. పెరికపెల్లి చంద్రపెల్లి సెంటర్లను బుధవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. వడ్లకు ప్రభుత్వం రూ.2320 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. సన్న రకాలకు రూ.500 బోనసు ప్రభుత్వం చెల్లించనున్నట్లు వివరించారు. రైతులు మధ్యవర్తులను దళారులను నమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు వరి కోతల సమయంలో మట్టి పెల్లలు, తాలు రాకుండా చూసుకోవాలన్నారు. నాణ్యత గల ధాన్యానికి ప్రభుత్వం కోత, తరుగు విధించకుండా పూర్తి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఆకన పెల్లి చాకెపల్లి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీడీఓ ఉపేందర్, వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ పీఏసీఎస్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం శ్యామల పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్-3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ వివిధ శాఖల అధికారులతో కలిసి పరీక్ష పరిశీలకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. 17వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు, 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం పరీక్షకు ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని ముఖ్య పర్యవేక్షకులకు మాత్రమే మొబైల్ అనుమతి ఉంటుందని, ఎవరికీ ఉండదని, ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు తరలించే రూట్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్ళరాదని, ఒకవేళ వెళ్ళినట్లయితే అట్టి అభ్యర్థి ఓఎంఆర్ షీట్ పరిగణలోకి తీసుకోబడదని తెలిపారు. పరీక్ష రోజు ఉదయం 7 గంటలకు జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయా పరీక్షా కేంద్రాలకు సామాగ్రిని పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య పాల్గొన్నారు.

రేపు బొగ్గు గనుల పరిరక్షణకు రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-మందమర్రి

బొగ్గు గనుల పరిరక్షణకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేసి, సింగరేణికే బొగ్గు గనులను కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 14న రౌండ్ టేబుల్ సమావేశాన్ని పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు సమావేశంలో పాల్గొనాలని కోరారు. సింగరేణి పరిరక్షణకు వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తెలుపాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని పార్టీలకి అతీతంగా అందరం కలిసి రక్షించుకుంటేనే మన భవిష్యత్తుకు, పిల్లల భవిష్యత్తుకు భరోసా అన్నారు. సమావేశంలో అన్ని వర్గాల నాయకులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరులకు నివాళి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం మాట్లాడుతూ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, చేరాలు, రంగవల్లి లాంటి తదితర విద్యార్థి నాయకులు ఈ దేశంలో జరుగుతున్న దోపిడీ పీడన అసమానతలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా విద్యార్థి వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి తమ ప్రాణాలు త్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాజ్ కుమార్, రవీందర్, ఇబ్రహీం, శ్రీకాంత్, అంజన్న పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద గుంతల పూడ్చివేత



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బస్సులు వెళ్లే ప్రదేశంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బస్సులకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రహించిన జన్నారం పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారులు గడ్డం శ్రీనివాస్ మామిడి విజయ్ తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్‌తో మొరంపోయించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ మేనేజర్ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు పలువురు వారిని అభినందించారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రకృతిపై అవగాహన, వన దర్శిని కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ సుష్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వనదర్శని కార్యక్రమంలో మండల కేంద్రంలోని జింకల పునరావాస కేంద్రం వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి ఆ జీవరాసుల గురించి వివరించారు. అడవి జంతువుల సంరక్షణ, అడవిలో ఉండే పక్షులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవిలో ఉన్న జంతువులపై ప్రేమ కారణ దయ కలిగి ఉండాలన్నారు. అడవులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. చెట్లను విరివిగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు డీఆర్ఓ తిరుపతి, ఎఫ్‌బీఓ లాల్బాయ్ పాల్గొన్నారు.

విలేకరులను దీషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల విలేకరులను సోషల్ మీడియాలో దూషించి కించపరిచేలా వాక్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులు, నిరాధారమైన మెసేజ్‌లు పెడుతూ జర్నలిస్టుల మనోభావాన్ని దెబ్బతీసిన వ్యక్తిని అరెస్టు చేయాలని కోరారు.

మహిళా ఉద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి ఓసి, 1, 3 గనులలో పనిచేస్తున్న మహిళ బదిలి వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు సర్ఫేస్‌లో గల 16 డిసిగ్నేషన్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎస్ఓ టు జీఎం శ్రీధర్ అన్నారు. మంగళవారం డీజీఎంలు పి అరవింద రావు, చిరంజీవులు, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌కు 34 మంది మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన సంబంధిత ఉద్యోగాలకు తర్వాత పంపించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పి ఓసీ గని మేనేజర్ బ్రహ్మాజీ, గని రక్షణాధికారి శ్రీనివాస్, ఎస్ఆర్పి ఓసీ, ఎస్ఆర్పి-3 గనుల సంక్షేమ అధికారులు శంకర్, గౌస్ పాషా పాల్గొన్నారు.

రివైజ్డ్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో 11వ వేజ్ బోర్డు పరిధిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినటువంటి ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన పెన్షన్ కొరకు అప్లై చేసుకున్న ఇప్పటివరకు రివైజ్డ్ పెన్షన్ అమలు కాకపోవడం వలన రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, వెంటనే యాజమాన్యం అర్హులైన రిటైర్డ్ ఉద్యోగులందరికీ 11 వ వేజ్ బోర్డుకు సంబంధించిన రివైజ్డ్ పెన్షన్ అమలు చేయాలని పేర్కొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికులపై డీఎం చేస్తున్న వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం డిపోలోని కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ డీఎం కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పల్లె వెలుగు ప్రయాణికులపైన ఎక్స్ ప్రెస్ బస్సు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డిపోలో జరుగుతున్న అక్రమాలపై ఆర్ఎం కూడా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులపై వేధింపులు ఆపకుంటే కార్మికులతో కలిసి డిపోను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని మర్ది గ్రామపంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ గౌరీ శంకర్‌కు ఆ గ్రామ యువకులు వినతిపత్రాన్ని అందించారు. మిషన్ భగీరథ పైపులైన్లు చెడిపోయి 15 రోజులు గడుస్తున్న వాటికి మరమ్మత్తులు చేయకపోవడంతో మిషన్ భగీరథ నీరు అందడం లేదన్నారు. గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని, మురుగు కాలువలకు మరమ్మత్తులు చేయకపోవడంతో నీరు వెళ్లక దుర్గంధం వెదజల్లుతోందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై ఎంపీడీఓ సానుకూలంగా స్పందిస్తూ రెండు రోజుల్లో గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని యువకులు తెలిపారు.



పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెచ్ఈఓ తూప్రాన్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో దాదాపు 136 కుటుంబాలకు తమ వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురు జ్వర పీడితులుగా గుర్తించి, వారి రక్త నమూనాలను సేకరించి చికిత్స చేశారు. అనంతరం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి, ఎనిమిది లార్వా రీడింగ్ పాయింట్లను గుర్తించి, 8 లార్వా బ్రీడింగ్ కంటైనర్లను నిర్మించి, 7 డ్రైనేజీలను గుర్తించారు. వాటిలో లార్వా పెరుగుదల కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో అవగాహన కల్పించారు. అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న 12 మందికి పరీక్షలు జరిపి ముగ్గురు బీపీ పేషెంట్లను, ఒకరు షుగర్ వ్యాధి ఉన్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్ఓ మీరాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, సిబ్బంది ఎస్.నారాయణ, హెల్త్ అసిస్టెంట్ బి.నారాయణ, హెల్త్ అసిస్టెంట్ టి.పద్మ, ఏఎన్ఎంలు పార్వతి, లావణ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే ఊరుకునేది లేదు



నవతెలంగాణ-కడెం

రైతులపై దొంగ ప్రేమ చూపుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తే ఊరుకునేదే లేదని డీసీసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో 8,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరు తెలుసుకోవచ్చన్నారు. రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి కుటుంబ పాలన సాగించిన, మీరు నీతులు చెప్తే చూసేవారు నవ్వుతున్నారని కేటీఆర్‌పై మండిపడ్డారు. 11 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వేల ఉద్యోగాలు ఇచ్చాం ఇచ్చిన ఆరు హామీలను దాదాపుగా అన్ని అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఇష్టానుసారంగా బూతులు తిడితే రాష్ట్ర మహిళలు ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారన్నారు. ఓ కలెక్టర్‌పై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మండల మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని తహసీల్దార్ ఎం.ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ కే.భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఈశ్వర్‌నగర్, రామ్‌నగర్‌లో నిర్వహించిన కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా వివరాలను సేకరించి, సర్వే చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోపు ఇచ్చిన ఫార్మాట్‌ను ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

గడువు తీరిన సెలైన్ బాటిల్ ఘటనపై విచారణ



నవతెలంగాణ-ఖానాపూర్

గత ఆగస్టు నెలలో ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రిలో గడువు తీరిన సెలైన్ బాటిల్ ఎక్కించడంతో అస్వస్థకు గురైన బాధితుని సంఘటనపై మంగళవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఇదివరకే ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురు ఉద్యోగులకు మెమోలు సైతం జారీ అయిన విషయం అందరికీ తెలిసిందే. విచారణలో భాగంగా సూపరింటెండెంట్, ఫార్మసిస్టులు, వైద్య సిబ్బందితో పాటు ఇదివరకే సస్పెండ్‌కు గురైన ఉద్యోగులను విచారించారు. పూర్తి నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణ కమిటీ అధికారి తెలిపారు. ఆయనతో పాటు ఏఓ కృష్ణవేణి వైద్య సిబ్బంది ఉన్నారు.

అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వికలాగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కొరకు ఈనెల 14వ తేదీ లోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 15వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 155326 లో సంప్రదించవచ్చని తెలిపారు.

సదర్‌మాట్ కాలువ కట్టను తవ్వేస్తున్నారు

- నాయకుల ముసుగులో అక్రమంగా మట్టి తరలింపు
- అడ్డుకున్న అధికారులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

కౌన్సిలర్ల ముసుగులో కొందరు నాయకులు సదర్‌మాట్ కెనాల్ కట్టను తవ్వేసి అక్రమంగా మట్టి తరలించుకుపోతున్నారు. ఇదేమిటని అడిగిన రైతులను లెక్కచేయకుండా వారి అక్రమ పనిని సాగిస్తున్నారు. ఎవరికి చెప్పినా భయపడం అనే తీరుగా మాట్లాడుతున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. శ్రీరాంనగర్ ప్రాంతంలో మంగళవారం ఇద్దరు నాయకులు కలిసి సదర్‌మాట్ కెనాల్ ఎడమ వైపు కట్టను జేసీబీతో తవ్వుతూ ట్రాక్టర్లలో మట్టిని తరలించారు. పట్టణంలో అంతర్గత రోడ్ల పనులు సాగుతున్నాయి. వాటిపై మట్టి నింపేందుకు సదర్‌మాట్ కాలువ కట్టను ఎంచుకున్నారు. నాలుగు అడుగుల లోతుతో మట్టిని తోడేస్తూ కట్టను బలహీనంగా చేశారు. విషయం పలువురు రైతులకు తెలియడంతో అక్రమ పనులను అడ్డుకొని నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న నీటి పారుదల సిబ్బంధి మట్టి తోడుతున్న జేసీబీ ఆపేశారు.

సదర్‌మాట్ కట్టలపై ఆజమాయిషీ..

అవినీతి పనులనే ఎంచుకున్న కొందరు నాయకులు సదర్‌మాట్ కాలువ కట్టపై చేస్తున్న అజమాయిషీని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పాలకులు ప్రజల మేలుకోసం పని చేయాలి. కట్ట తవ్వితే బలహీనంగా మారి తెగిపోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి చర్యలవల్ల కాలువకు గండ్లు పడి రైతులకు నష్టం జరుగుతదని తెలిసి కూడా స్వలాభం కోసం మట్టిని తరలిస్తు సొమ్ము చేసుకుంటున్న నాయకుల తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతం నుంచి కొందరు అక్రమార్కులు మట్టిని తరలించిన విషయాన్ని గుర్తు చేస్తూ దూషిస్తున్నారు.

కట్టలను తవ్వితే చర్యలు తప్పవు : జేఈ వీరన్న

కెనాల్ కట్టలను ఎవరు తవ్వినా చర్యలు తీసుకుంటాం. కాలువకు ఇరువైపుల 33 అడుగుల వెడల్పు దాకా ఎవరు ముట్టరాదు. నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోం.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

- పరిశీలకులు కె.సురేంద్ర మోహన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని, జాబితా రూపకల్పన పై అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. పీవీటీజీ గ్రామాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, స్వీప్ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో అంబాసిడర్లను నియమించి ప్రచారం నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి అధికారులను నియమించామని తెలిపారు. ఈనెల 28 వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. తుది ఓటరు జాబితాను జనవరి 6న ప్రకటిస్తామన్నారు. అంతకుముందు మొదటిసారిగా కలెక్టరేట్‌కు వచ్చిన ఓటరు జాబితా పరిశీలకులకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, విభాగం అధికారులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



నవతెలంగాణ-నిర్మల్

బాసర ట్రిపుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యార్థి సంఘ నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధాకరమని ట్రిపుల్ ఐటీలో కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రస్తుత సీఎం గతంలో బాసర ట్రిపుల్ ఐటీ గోడ దూకి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారని ప్రస్తుతం సీఎం అయిన తర్వాత బాసరను సందర్శించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు, జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్, దిగంబర్, జవహర్, రాహుల్, కైలాస్ పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపయోగం



నవతెలంగాణ-తాంసి

విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో సమానమైన వృత్తి విద్య శిక్షణ కోర్సులు పూర్తి చేయడంతో భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు చేసి ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బందితో కలిసి విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్య శిక్షణ కోర్సులతో విద్యార్థులు రాబోయే రోజుల్లో ఎవరిపై ఆధారపడకుండా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇదే కళాశాలలో కష్టపడి చదివిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కష్టపడి చదివిన విద్యార్థిని విద్యార్థులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మీరు ప్రయోజకులైతే మీ కుటుంబంతో పాటు మేము కూడా ఎంతో సంతోషంగా ఉంటామన్నారు. ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలువురిని పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, జాదవ్ గణేష్, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 11నెలలుగా కోడిగుడ్ల బిల్లు, 6 నుంచి 9 నెలల మెస్ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇదే క్రమంలో విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టాలని అధికారులు ఒత్తిడి పెంచుతున్నారన్నారు. తక్కువ గౌరవంతో పని చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కార్మికులకు రూ.10వేలను అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. పెండింగ్ బిల్లులతో పాటు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ధనోర(బి)కి చెందిన మెస్రం అనామికకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.44వేల చెక్కును మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముఖాడే ఉత్తం చేతుల మీదుగా అందజేశారు. లబ్దిదారులు గతంలో అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా లక్షన్నర వరకు ఖర్చు కావడంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో చెక్కు మంజూరు అయిందని అన్నారు. దీంతో కుటుంబీకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైరాం, విశాల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేలా.. పోటీల నిర్వహణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజనుల అభ్యున్నతితో పాటు వారిని క్రీడాల్లో రాణించేలా వనవాసి కళ్యాణ పరిషత్ ప్రత్యేకంగా క్రీడ పోటీలను నిర్వహిస్తోందని వనవాసి కళ్యాణ్ ఆశ్రమం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి తాడేపల్లి శివరామక్రిష్ణ అన్నారు. భగవాన్ బీర్సాముండ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. దీనికి ఆయనతో పాటు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉష్కం రాఘుపతి, రాష్ట్రపాల్ ముఖ్య అథితులుగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వనవాసి కళ్యాణ్ ఆశ్రమం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి తాడేపల్లి శివరామక్రిష్ణ మాట్లాడుతూ గిరిజనులను క్రీడాల్లో ప్రోత్సహించేలా ప్రతి యేట పరిషత్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 300 మంది క్రీడకారులు ఆయా క్రీడాల్లో రాణించి, ముందుకెళ్లారని తెలిపారు. ఓలంపిక్‌కు ఎంపికయ్యారన్నారు. ఆదివాసుల హక్కులతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన వీరుడు బీర్సాముండ అని కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పోటీలు సాగుతాయన్నారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.10వేల 16, రెండవ బహుమతి రూ.5వేల 16 అందిస్తామన్నారు. కార్యక్రమంలో వనవాసి తొడసం అజయ్, మడావి మణిక్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన వైద్యాధికారికి సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

నూతనంగా ఆసిఫాబాద్ జిల్లా వైద్యశాఖాధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీని డాక్టర్ సీతారాం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన ఆస్పత్రిలోని పలు రికార్డులు, గదులు పరిశీలించి వైద్యం అందిస్తున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టుకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీలు 2, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 1 అకౌంటెంట్ పోస్ట్ కాళీ ఉన్నాయని, ఐదు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అకౌంటెంట్ పోస్ట్‌కు బీకాం డిగ్రీతో పాటు కంప్యూటర్ సర్టిఫికెట్స్ లేదా బీకాం కంప్యూటర్స్ చదివి ఉండాలని, ఏఎన్ఎం పోస్టుకు నర్సింగ్ సర్టిఫికెట్ ఉండాలని, 18 నుండి 45 సంవత్సరాలలోపు ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు, ఈనెల 18 నుండి 20లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

సీనియర్ సిటిజన్లకు మెరుగైన వైద్యసేవలందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వపరంగా ఉచిత ఆరోగ్యసేవలందించి, ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిబంధనలున్నా జిల్లాలోని ఆస్పత్రులలో ఇది పాటించడం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో కొనసాగుతోంది. మండలంలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన సర్వేలో ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6న సర్వే ప్రారంభం కాక 8 వరకు ఇండ్ల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి, 9 నుండి ప్రశ్నావళి సేకరణ కొనసాగుతుందన్నారు. దీనిలో 75 రకాల ప్రశ్నలు ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా సర్వేపకడ్బందీగా చేయాలని సిబ్బందికి సూచించారు.